# 17

# తప్పెట్లోయ్... తాళాలోయ్!

'**తా**ళం' అన్నమాటకు చాలా అర్థాలున్నాయి. ఇద్దరు మల్లయోధులు హెూరా హెూరీగా పోరాడుతున్నప్పుడు ఎదుటి వారిని చిత్తు చేసేందుకు ఒక యోధుడు ఉపయోగించే బంధవిశేషం అని ఒక అర్థం వున్నట్టు మహాభారతం చెబుతున్నది. తాడిచెట్టు అనీ, పాట పాడేటప్పుడు లయకోసం చేతితో చేసేచప్పుడు అనీ, కాల పరిమాణం తెలియజేసే విధానమనీ, 'బీగం' అనీ ఇల్లాగా చాలా వున్నాయి.

అసలీ బీగాలు ఎప్పుడు వెలిశాయో ఖచ్చితంగా చెప్పగల ఆధారాలేమీ లేవు. అనాది మానవునకు ఏ పూట తిండి ఆ పూటకే కాక, మరో పూటక్కూడా సంపాదించటం నేర్చుకొన్నప్పటి నుండీ ఈ తాళం అంటే బీగం వాడుకలోకి వచ్చి ఉండాలి.

తన సంపాదనను మరొకరు కాజేయకుండా దాచుకోవడానికి అతను అనుసరించిన విధానాలన్నీ తాళం తయారు కావడానికి తోడ్పడ్డాయి. తన ఆర్జనను కొండ సెరియల్లోనో గుహల్లోనో దాచి పెట్టి అది మరొకరికి కనపడకుండా ఏ రాతి పలకనో అడ్డం పెట్టి వుంటాడు అనుకొంటే అదే మొదటి తాళమని మనం చెప్పుకుందాం.

వ్యక్తిగత ఆస్తులు పెరిగిన కొద్దీ అవి మరొకరు దోచుకుపోకుండా దాచుకోవలసిన అవసరాలు కూడా పెరుగుతూనే వున్నాయి. ఇలా పెరుగుతున్న అవసరాలే రకరకాల తాళాలు వెలియడానికి కారణాలవుతున్నాయి.

నిజమే కాని ఇవన్నీ తాళలు బాగు చేసే జహంగీరుకు తెలియవు. అతనికి తెలిసిందల్లా ఎలాంటి తాళాన్నయినా సులువుగా అర్థం చేసుకోవడం. దానికొచ్చిన జబ్బేమిటో క్షణాలమీద అంచనా వేయగలగడం.

జహంగీర్ తాతగానీ, తండ్రిగానీ, ప్రారంభం నుండి ఈ వృత్తిలో లేరు. అతని తాత మసీదులో ప్రార్థనలు చేసేవాడుట. అప్పటి జాగీర్దారు వారి తాతగారికి పాతికెకరాల మాన్యం, తెల్ల గుర్రం కానుకగా యిచ్చారు. అతని తండ్రి హయాంలో కూడా మాన్యం వుండేది. తాతలూ తండ్రులూ భాగాలు పంచుకునేటప్పటికి ఎకరానికన్నా తక్కువగా వచ్చింది.

జహంగీర్ తండ్రి వయసులో వున్నప్పుడు నవాబులాగా బతికాడుట కాని ముసలితనంలో గంపెడు సంసారాన్ని ఈదడానికి చాలా కష్టాలు పడ్డాడు.

కొంతకాలం వ్యవసాయం పనులు చేశాడు. ఏటెల్లకాలమూ, ఆ పనులైనా వుండవుగదా. వర్షపుకాలంలో కటికవస్తువులు చేసేవారు. ఇది పని కాదనుకుని పట్నం చేరుకున్నారు. ఆ తరువాత ఒక కమ్మరి దగ్గర సమ్మెట వేయడానికి కుదిరాడు. పనికొత్త. చాతకాదు చెమటలు కక్కుతూ మణుగు బరువుండే సమ్మెట తీసుకొని దాకలిమీద కాలిన ఇనుప ముక్కమీద దెబ్బలు వేస్తుంటే అణుసు ముక్కలు లేచి, పాదాలన్నీ ఛర్రుమని కాలుతుండేవట. పొద్దుగూకులూ పనిచేస్తే రూపాయి కూడా గిట్టేది కాదు. దాంతో తెల్లజొన్నలు కొనుక్కుని రొట్టెలు చేసుకుతినేవారు.

జహంగీరును చదివించాలని వాళ్ళనాన్న తపనపడ్డారు కానీ కుదిరింది కాదు. అందుకని తను పనిచేసే చోటనే తిత్తులు వూదడానికి కొడుకును పెట్టాడు.

ఆ పని నాకు కొత్త. మరీ చిన్నవాణ్ని. గూడలు పులిసిపోయేవి సార్, రోజుకు పావలా యిచ్చేవాళ్లు. ఒకసారి ఆలస్యంగా పనిలోకొచ్చా. సేట్‌కు కోపం వచ్చి సదుకోల్ కడ్డీతో కాలి మీద కాల్చాడు అన్నాడు జహంగీర్ పిక్కమీద వాతను చూపిస్తూ.

ఆ తరువాతనే జహంగీర్ తన పినతల్లి దగ్గరకు పారిపోయాడు. ఆవిడ భర్త తాళాలు బాగు చేస్తూ వుంటే తనూ నేర్చుకున్నాడు. రకరకాల తాళాలను తన చిన్నాన్న బాగు చేస్తూ వుంటే జహంగీర్ అబ్బురంగా చూసేవాడు. తరవాత తనూ చిన్న చిన్న మరమ్మత్తులు ప్రారంభించాడు. ఇప్పుడా వృత్తిలో ఆరితేరాడు.

జహంగీర్ దగ్గర కొన్ని వందల తాళపు చేతులున్నాయి. వాటినన్నింటినీ తీగకు తగిలించి కాసుల పేరులాగా గోడకు వేళ్లాడేశాడు. తాళాన్ని చూస్తూనే అదెక్కడ చెడిపోయిందో అతను కనుక్కోగలడట.

"రోగిని చూడగానే అతనికి ఏ జబ్బున్నదో డాక్టరుకు తెలియదా? అలాగే నాకూ తెలుస్తుంది" అన్నాడు జహంగీర్. తన జీవితకాలంలో కొన్ని వేల తాళాలు బాగు చేయగలిగానన్నాడు జహంగీర్. "ఇప్పుడు మరీ చిత్రమైన తాళాలు వస్తున్నాయండీ. ఆ తాళాలు రెండు తాళపు చెవులుంటాయి. ఒకటి పోయిందనుకోండి మరింక అది పనికిరాదు. దాన్ని బాగు చేస్తే ఎక్కువ ఛార్జీ తీసుకుంటాను" అన్నాడు జహంగీర్ నవ్వుతూ.

నిజానికందులో బాగు చేయవలసింది కూడా ఏమీ వుండదనీ, ఇంకో తాళం చెవి తయారు చేయడమేనని అన్నాడు. కానీ ఖాతాదారులతో అతనలా చెప్పడు. ఏవేవో బెట్లు చెడిపోయాయనీ, అవన్నీ సరిదిద్ది కొత్త చెవిని తయారు చేయాలనీ తాను చెబుతాట్ట. రెండు రోజుల వ్యవధి కావాలంటాట్ట. కానీ అంత టైం అనవసరమనీ, గంటలోపుగానే ఇంకో చెవిని తయారు చేయవచ్చుననీ అన్నాడు.

అతని చుట్టూ బోలెడన్ని తాళాలు రిపేరుకు ఎదురుచూస్తూ పడివున్నాయి. కొన్నింటిని కిరసనాయల్లో నానవేశాడు. అతని చార్జీలు పనిని బట్టీ, తాళాన్ని బట్టీ, వచ్చిన కాతాదారుని బట్టీ మారుతుంటాయి.

సైకిల్ తాళం లగాయితు బ్యాంకుల తాళాల దాకా అతను బాగు చేస్తాడు. ఒకసారి వొక బ్యాంకు తాళం చెడిపోయిందట. బాగు చేసి యాభయి రూపాయలు వసూలు చేశాడట. "ఆదాయం సంగతి చెప్పలేం సార్, ఒక్కో రోజు మూడునాలుగ్గూడా రావు. ఇంకో రోజున పదిహేను ఇరవైదాకా కళ్ళ చూస్తాను" అంటాడు జహంగీర్.

ఇంత చేసినా పొట్టకూ, బట్టకూ, అస్తూ బిస్తూగా సరిపోతుందే తప్ప తాను వెనకేసుకున్నదేమీ లేదంటాడు. ఈ పనిలో కూడా పోటీ పెరిగిందని, అందువల్ల గతిలేక ఏదోకాడికి పనిచేయక తప్పదని అతనన్నాడు.

జహంగీర్ ఇల్లు చాలా చిన్నది. ఓ కలిగినవారి గోడకు ఆనబెట్టి చిన్న రేకుల పాక వేసుకొన్నాడు. అన్నీ చిన్న సీనారేకులు. అవి గాలికి లేచిపోకుండా బరువుకోసం రాళ్ళను మోపు చేశాడు. ఇంటి ముందుగా మురుక్కాలవ. రేకుల తడికెను వాకిలి అడ్డంగా వేసి దాన్ని తాడుతో ముడి వేశాడు. చిన్న పిల్లలూ భార్యా వూరికి వెళ్ళారుట. ఇంట్లో కూడా తాళం చేతుల గుత్తులూ, తాళాలు వేళ్ళాడుతున్నాయి.

కలవారిసంపదకు కాపలా కాసే వేలాది తాళాలను బాగు చేయగల జహంగీర్ పాక తలుపుకు ఓ చిన్న తాళం కప్ప కూడా లేకపోవడం ఆశ్చర్యం కదూ?

“మా కొంపకెందుకండీ బాబూ తాళాలు? ఎత్తుకుపోవడానికేముంది గనక ఆ దరిద్రంతప్ప?” అని బాధగా నవ్వాడు జహంగీర్ - పెరిగిన గడ్డాన్ని బిరుసువేళ్ళతో సవరించుకొంటూ.

అవును జహంగీరును దోచుకోవడానికి అతని దగ్గర దరిద్రం తప్ప ఏమి లేదు కూడా!